అలుగుపారిన జల్‌పల్లి చెరువు



నిండు కుండను తలపిస్తున్న జల్‌పల్లి చెరువు

ఆనందంలో గ్రామ ప్రజలు

- అలుగు నీటిలో యువత కేరింత

పహాడీషరీఫ్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో జల్‌పల్లి పెద్ద చెరువు అలుగు పారింది. శనివారం తెల్లవారుజాము నుంచి అలుగు పారుతున్న విషయం తెలుసుకున్న గ్రామ యువకులు గట్ల నడుమ ఉన్న అలుగు నుంచి జాలువారుతున్న నీటి దృశ్యాలను ఫోన్లో బంధిస్తూ అహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించారు. రెండేళ్ల అనంతరం వినాయక చవితి పర్వదినాన అలుగు దూకడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. యువకులు ప్రమాదకర రీతిలో అలుగు వద్దకు వెళుతున్న విషయం తెలుసుకున్న వెంటనే పహాడీషరీఫ్ పోలీసులు చెరువు కట్ట వైపు భారీకేడ్లను ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. స్వచ్ఛమైన నీటితో జలకళను సంతరించుకున్న ఈ చెరువును గతంలో పేర్కొన్న మాదిరిగా సుందరీకరిస్తే పర్యాటక కేంద్రంగా విరజిల్లుతుందని గ్రామస్థులు కోరుతున్నారు.

గొలుసు కట్టు చెరువులకు...

సాగు, తాగు నీరే లక్ష్యంగా నిజాం నవాబు హయాంలో జల్‌పల్లి పరిసరాలలో నిర్మించిన గొలుసుకట్టు చెరువులు నిండు కుండలా మారి జల కళను సంతరించుకున్నాయి. దాదాపు పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో శంషాబాద్ విమానాశ్రయం, మామిడిపల్లి కొండల నుంచి భారీగా వస్తున్న వరదతో జల్‌పల్లి చెరువుకు పారుతుంది. జల్‌పల్లి గ్రామం ఎగువ నుంచి వచ్చిన నీరు కూడా తోడవ్వడంతో అప్పటికే దాదాపుగా నిండిన ఈ చెరువు అలుగు పారడం ప్రారంభమయ్యింది. దాదాపు 150 ఎకరాల సువిశాల విస్తీర్ణంతో కూడిన ఈ చెరువును చూడడానికి స్థానిక ప్రజలతో పాటు మైలార్‌దేవ్‌పల్లి, లక్ష్మిగూడ, శంషాబాద్, పాతబస్తీ ప్రజలు కూడా తరలివస్తున్నారు. ముఖ్యంగా అలుగుతో పాటు ఇటు ముత్యాలమ్మ ఆలయం వద్ద కార్గో రోడ్డుపైకి సైతం నీరు ఎగబాకి పారుతుండడంతో చిన్నారులు అందులో కేరింతలు కొడుతూ చేపలు పడుతూ ఆనందలో మునుగుతున్నారు.

మిషన్ కాకతీయతో చెరువుకు మహర్దశ..

ఒకప్పుడు పూడికతీతకు నోచుకోక, అలుగు ధ్వంసమై, కట్ట కుచించుకుపోయి దీనస్థితిలో ఉన్న ఈ చెరువుకు మిషన్ కాకతీయతతో పూర్వవైభవం నెలకొంది. 2017లో పనులు పూర్తికావడం, అదే ఏడాది భారీ వర్షాలు కురవడంతో 40 ఏళ్ల అనంతరం ఈ చెరువు అలుగు పారింది. అప్పటి నుంచి పెద్ద ఎత్తున చేపలను కూడా ఈ చెరువులో పెంచుతూ వందలాది మంది జీవనోపాధి పొందుతున్నారు. ఇదిలా ఉండగా పూర్తిగా నిండిన చెరువు అలుగు పారుతుండడంతో చేపలు కొట్టుకుపోతున్నాయని పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలుగు పైనుంచి వెళుతున్న నీటిలో చేపలు కొట్టుకుపోకుండా అడ్డంకిగా ఏర్పాటు చేస్తున్న వైర్లను కూడా కొందరు యువకులు తొలగించడంతో తమకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రవహిస్తున్న నీటిలో ఆడుతున్న యువకులు మహిళలు



రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిలో చేపలు పడుతున్న చిన్నారులు

క్లుప్తంగా

మహేష్‌కుమార్‌గౌడ్‌కు సన్మానం



మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగారెడ్డి

కందుకూరు: టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆదివారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌యూఐ నుంచి పీసీసీ అధ్యక్షుడిగా ఎదిగిన మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణలో పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోరుప్రోలు రాణాప్రతాప్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, సభావత్ లచ్చానాయక్, మునావత్ పాండునాయక్, కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, అనేగోని పాండుగౌడ్, మంద సాయిలు, సురసాని రాంరెడ్డి, గౌరిగె రాజు, అండేకార్ సురేందర్, ఢిల్లీ కృష్ణ, రావుల జంగయ్య, రాంరెడ్డి, మహేందర్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి సత్కారం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని పలువురు నాయకులు సత్కరించారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పున్న గణేష్ నేత, బండి మధుసూదన్ రావు, నల్లెంకి ధనరాజ్ గౌడ్, తలాటి రమేశ్ నేత, పుట్టగల్ల జగన్, పందుల వెంకటేశ్ గౌడ్, జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, కళ్యాణ్ యాదవ్, భూపాల్ రెడ్డి, యాదవ్ రెడ్డి, సురేందర్, మహమ్మద్, గోవర్ధన్ రెడ్డి, హైమద్, సంతోష్, విజ్ఞాన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన కేఎల్లార్



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కేఎల్లార్

తుక్కుగూడ: పీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఏఐసీసీ నియమించింది. దీంతో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ఆదివారం నగరంలోని మహేశ్‌గౌడ్‌ను నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అగ్రనాయకత్వం రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగా మహేశ్‌గౌడ్‌కు పీసీసీ బాధ్యతలను అప్పగించిందన్నారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందన్నారు.

డీకే అరుణను కలిసిన రావిర్యాల రైతులు



డీకే అరుణకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామ కొంగురు ఖుర్దు-ఏ రెవెన్యూ వక్ఫ్ బోర్డు భూముల రైతులు ఆదివారం బీజేపీ ఎంపీ డీకే అరుణను నగరంలోని ఆమె నివాసంలో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా రైతులు భూముల సమస్యపై ఆమెకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ రెవెన్యూ పరిధిలోని సుమారు 600 ఎకరాల రైతుల భూములను వక్ఫ్ బోర్డు భూములుగా గత ప్రభుత్వాలు గెజిట్ ఇచ్చాయన్నారు. వక్ఫ్‌బోర్డు పేరు తొలగించి తమకు న్యాయం చేయాలని ఎంపీని కోరామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, శివకుమార్, రైతులు వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జంగయ్య, పర్వతాలు, హరికిషన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమోటా రూ.19, వంకాయ రూ.40, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.55, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.44, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ17, పొట్లకాయ రూ.28, అరటికాయ రూ.28, అర్వి రూ.45, మునగ రూ.28, చిలుకడదుంప రూ.55, బీట్‌రూట్ రూ.23, కీర రూ.28, బీన్స్ రూ.85, క్యాప్సికమ్ రూ.60. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీని అరికట్టాలని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు మాధవరం నర్సింహారావు డిమాండ్ చేశారు. ఆదివారం హస్తినాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు వైరల్ ఫీవర్‌తో ఆసుపత్రులలో చేరితే వైద్యం పేరుతో లక్షలాది రూపాయాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆసుపత్రులు, క్లినిక్‌లను జిల్లా వైద్యాధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

ముంపు కాలనీలకు విముక్తి కల్పించాం



ఎస్ఎన్‌డీపీ నాలాను పరిశీలించిన ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: ప్రతి ఏటా ముంపుతో ఇబ్బంది పడుతున్న కాలనీలను ఎస్ఎన్‌డీపీ పథకంతో సుమారు 80కి పైగా కాలనీలకు ముంపు నుంచి విముక్తి కల్పించామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో ముంపు బారిన పడుతున్న కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ గతంలో చిన్న పాటి వర్షాలకు కాలనీలు వరదల్లో చిక్కుకుని ధన, ప్రాణ నష్టం సంభవించేవన్నారు. ఈ విషయాన్ని గ్రహించి గత ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి ఎస్ఎన్‌డీపీ పథకం ద్వారా నాలాల నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. రూ.14 కోట్లతో బాలాజీనగర్, ఎస్‌జేఆర్ కాలనీ, రామిడి మల్లారెడ్డినగర్, బోయపల్లి ఎన్‌క్లేవ్, మధురాపురి ఫేస్-1, 2, సీవైఆర్ కాలనీ, షిరిడి నగర్, రామిడి హిల్స్, సౌభాగ్య నగర్ వంటి కాలనీలకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. త్వరలో రూ.9 కోట్లతో కోమటి కుంట చెరువునుంచి పెద్ద చెరువు వరకూ ఎస్ఎన్‌డీపీ పనులు మొదలు పెట్టనున్నట్లు వెల్లడించారు. మొదటి విడతలో చేసిన ఈ పనుల వల్ల ముంపు సమస్య తీరిందన్నారు. రెండు మూడు విడతల్లో కూడా ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి చేసేలా ఇప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్లు సంరెడ్డి స్వప్న వెంకట్‌రెడ్డి, రామిడి కవితరెడ్డి, బోయపల్లి దీపిక శేఖర్‌రెడ్డి, ముత్యాల లలిత కృష్ణ, రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవ సమితికి చెక్కు అందజేత



బాలాపూర్ ఉత్సవ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న పన్నాల పర్వతాలురెడ్డి

బడంగ్‌పేట్: బాలాపూర్ గణపతి ఉత్సవసమితికి స్థానికుడు పన్నాల పర్వతాలు రెడ్డి రూ. 2.40ల చెక్కు అందజేశారు. ప్రతీ ఏడాది గణనాథుని విగ్రహదాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సారి కూడా విగ్రహం కొనుగోలు నిమిత్తం సాయం చేశారు. ఈ సందర్భంగా పన్నాల పర్వతాలురెడ్డి కుమారులు వంశీరెడ్డి, కిరణ్‌రెడ్డిలు బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులకు అందచేశారు. బాలాపూర్ గణనాథుని ఆశీర్వాదాలు ఎల్లప్పుడు పన్నాల పర్వతాలురెడ్డి కుటుంబానికి ఉండాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులు గణనాథున్ని వేడుకున్నట్లు చెప్పారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, మండప నిర్వాహకులు స్థానిక కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, టీకుల శశిధర్‌రెడ్డి, పి.రాజేందర్‌రెడ్డి, టీకుల సుధాకర్‌రెడ్డి, పోరెడ్డి అరవింద్‌రెడ్డి, సంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

మండల పరిధిలో పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా యువజన సంఘాలు, ఆలయ కమిటీలు, ఇతర సంఘాల ఆధ్వర్యంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలను నెలకొల్పారు. ఉదయం ఆలయాలు, మండపాల్లో అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్రపుష్పం, పుష్పాలంకరణతో పాటు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మహేశ్వరం: అమీర్‌పేట్ గ్రామంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు



తుక్కుగూడలో గణపతికి పూజలు చేస్తున్న చిన్నారులు



కందుకూరు: గూడూరులో గణపయ్యకు పూజలు చేస్తున్న భక్తులు



మహేశ్వరం: నందుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లో గణనాథుడి పూజలో కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి తదితరులు

బహుజన యోధుడు పాపన్నగౌడ్



భూమిపూజ చేస్తున్న గౌడ సంఘం నాయకులు

కడ్తాల్: బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మాలే మల్లేశ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు కందికంటి సుధాకర్‌గౌడ్ అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారని, పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆదివారం మండల కేంద్రం అన్మాస్‌పల్లి కూడలిలో సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. త్వరలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుధాకర్‌గౌడ్, యాదయ్యగౌడ్, జగన్‌గౌడ్, సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, శివగౌడ్, రాజుగౌడ్ కుంభం మల్లేశ్‌గౌడ్, వసంత కృష్ణ, జగదీశ్, నర్సింహగౌడ్ తదితరులు ఉన్నారు.

రావిచేడ్‌లో మద్దెలమ్మకు బోనాలు

కడ్తాల్: మండల పరిధి రావిచేడ్ గ్రామంలో మద్దెలమ్మకు ఆదివారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో బోనాలు చేశారు. నెత్తిన బోనంతో మహిళలు పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా మద్దెలమ్మ ఆలయానికి చేరుకున్నారు. చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యంగా బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పాడి పంటలతో పల్లెలు పచ్చగా ఉండాలని మొక్కుకున్నారు. పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



బోనాలతో మహిళలు

నిమజ్జన ఏర్పాట్లు ముమ్మరం



కట్టపై క్రేన్ ఏర్పాటు కోసం తొలగించిన జాలి

పహాడీషరీఫ్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జల్‌పల్లి పెద్ద చెరువు కట్టపై నిమజ్జనోత్సవానికి మున్సిపాలిటీ, పోలీస్ అధికారులు ఏర్పాట్లు చేశారు. నవరాత్రుల్లో 3,5,7,9,11 రోజుల్లో గణపతులను నిమజ్జనం చేయనున్న నేపథ్యంలో మూడో రోజైన సోమవారం నుంచే ప్రారంభం కానుండడంతో ఆదివారం ఏర్పాట్లు ముమ్మరం చేశారు. కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి ఆధ్వర్యంలో కట్టపై 16 టన్నుల సామర్థ్యం కలిగిన రెండు క్రేన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ సీఐ పి.గురువారెడ్డి, ఎస్ఐ డి.శ్రీను పర్యవేక్షణలో కట్టపై మైసమ్మ ఆలయం వద్ద పికెటింగ్ ఏర్పాటు చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు సీసీ కెమెరాలను బిగించారు. కట్టపై పూర్తిగా జాలీ ఉండగా.. రెండు ప్రదేశాల్లో రెండు క్రేన్‌లతో కార్యక్రమం నిర్వహించేందుకు వీలుగా జాలీలను తొలగించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో నిమజ్జన ప్రక్రియ ముగించాలని అధికారులు కోరారు.